శ్రీ బృందావనపురి సూర్యబలిజ సంక్షేమ సంఘం మచిలీపట్నం వార్షికోత్సవములలో అప్పటి పట్టణ అధ్యక్షులు
శ్రీ గంపల గంపల నాగ సురేష్ అధ్యక్షతన జరిగిన సంఘ వార్షికోత్సవంలో విశిష్ట అతిథులుగా విచ్చేసిన

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ -
చేనేత జౌళి మరియు ఎక్సైజ్ శాఖామాత్యులు
గౌరవనీయులు శ్రీ **కొల్లు రవీంద్ర** గారికి

బందరు పార్లమెంటు సభ్యులు మరియు ప్యానల్ స్పీకర్
గౌరవనీయులు శ్రీ **కొనకళ్ళ నారాయణ రావు** గారికి

వేదికనలంకరించిన యితర అతిథి మహాశయులకు

రాష్ట్ర సూర్యబలిజ సంఘం సవినయముగా సమర్పించు - **వినతి పత్రం** -

ఆర్య మహాశయులారా !

చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెంది యోగినీమూర్తులుగా - సాధ్వీమతల్లులుగా - పుణ్యస్త్రీలుగా భాసిల్లి, దైవజ్ఞుల మన్ననలు పొంది, కుంభహారతులందించి, దేవుని ఉత్సవములలో ప్రథమ తాంబూల బహుకృతులందుకొని, కాలగమనంలో కళంకితగా ముద్రవేయబడి, సామాజిక స్పృహకు దూరమై, కనుమరుగై, స్వీయసంస్కరణ ప్రధాన కుటుంబ వ్యవస్థకు కట్టుబడి, ఉన్నత విలువలతో సభ్యతా సంస్కారాలతో చిన్న చిన్న చేతి వృత్తులతో అత్యంత భారంగా జీవికను కొనసాగిస్తున్న దేవదాసి సంతతి వారసుల "సూర్యబలిజ సంఘం" మరియు వెనుకబడిన తరగతుల వర్గీకరణలో గ్రూప్ 'డి' కేటగిరిలోని వ.నెం. 14 మరియు కేంద్ర ప్రభుత్వ యితర వెనుకబడిన తరగతుల ఆంధ్రప్రదేశ్ జాబితాలో వ.నెం. 74 గా గుర్తింపబడిన వర్గంమాది.

"కాకా కలేకర్" కమిషన్ మొదలుకొని వివిధ వెనుకబడిన తరగతుల కమీషన్ల విచారణా వేదికల ద్వారా అన్ని యితర వెనుకబడిన కులాలు ప్రభుత్వ పరంగా వనరులందుకొని చైతన్య స్రవంతిలో పయనించుచుండ మేముమాత్రం న్యూనతకు తావులేని కులం పేరు మార్పు కొరకు యిన్నినాళ్ళుగా పరితపిస్తూ పరిభ్రమించామే తప్ప ఏనాడు ఆర్థిక అవలంబనమార్గాలను అన్వేషించుటకు ప్రయత్నించిన సందర్భంలేదు. 60సుదీర్ఘ వసంతాలు శ్రమించి పరిశ్రమించి **"సూర్యబలిజలు"**గా 1989 సం॥లో రూపాంతరం చెందాం. చదువుకొనే విద్యార్థినులకు మహిళా ఉద్యోగులకు కొద్దిపాటి సామాజిక భద్రతను పొందుపరిచాం. బహిరంగంగా నలుగురు సంఘీయులు కలుసుకొనే పరిస్థితుల ఏర్పరచుకోగలాం. రూపాంతరం చెందిన సూర్యబలిజ పేరును రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు 1994 - 1996 సం॥లలో నమోదుచేస్తూ ఎట్టి పరిస్థితులలోనూ బ్రాకెట్లలో గల పాత పేరును ఉదహరించరాదనెడి ఆంక్షలను గమనిస్తే మాకు మాతరాలకు సంబంధించని, సామాజికంగా ఏనాడోపడిన మచ్చను శాశ్వతం చేసి, వెక్కిరిస్తూ, దశాబ్దాల తరబడి కొనసాగుచున్న ఈసడింపులకు - ఛీత్కారాలకు - అవహేళనల ఎడతెగనిదాడికి జీవచ్ఛవాలుగా మిగిలి బాషకందని మా మౌనఘోష సాంద్రతను అంచనా వేయగలరు.

"కులం పేరు మారిందేకాని-ఆర్థికంగా - సౌహార్థికంగా ఒరిగిందేమీలేదని, సామాజిక-ఆర్థికస్థితిగతుల దుర్భరమైన " వైనాన్ని ఆర్థిక వేత్తలు స్పష్టం చేశారు ఆనాడే. (ఆంగ్ల దిన పత్రిక ది. 24-11-1996 డక్కన్ క్రానికల్ హైదరాబాదు), ఆర్థిక వేత్తల ఈ విశ్లేషణ నేటికీ కొనసాగుచున్న మా సంఘీయుల స్థితిగతులకు దర్పణమని తమవంటి పెద్దలు గ్రహించవలసిన సమయమిది. మా వంటి దుర్భరమైన బ్రతుకులను వెళ్ళదీసిన వెళ్ళదీస్తున్న వర్గం - వర్ణం మరొకటి భూమండలంలో ఏకాలంలోనూ లేదు గాక లేదు. 1947 సం॥లో XXX1 వ చట్టం ద్వారా " దేవదాసి " వ్యవస్థను నిరోధించి 1988 సం॥పు 10వ చట్టం ద్వారా నిషేదించినా మాకుటుంబాలకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రాధినేతలు గాని, గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజ్యాంగ పరిరక్షణ యంత్రాంగం కాని పునరావాస ప్రక్రియ రూపొందించుటకు కనీస ఆలోచనలు చేసి యుండలేదు. దురదృష్ట జాతకులమనుకొని, యిదంతా తమ తలరాతలుగా తలచుకొని దశాబ్దాల తరబడి క్షుభితమవుతున్న మావర్గం పట్ల ఉదారవైఖరి అవలింబించవలసిన వాస్తవాన్ని ఏలికలు యిన్నినాళ్ళుగా ఏ సందర్భంలోనూ గ్రహించినది లేదు. కర్నాటక - మహారాష్ట్ర-ఒరిస్సా - తమిళనాడు మున్నగు రాష్ట్రాలలో మా యీ సామాజిక వర్గమునకు విద్య-ఉపాధి రంగాలలో మెరుగైన రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించుటయేగాక వివిధ రకాల పునరావాస పథకాలను విస్తృత పరిధిలో అమలు చేయుచున్న వాస్తవాలను పరిగణనలోనికి తీసుకొనియైనా మా సంఘీయుల సంక్షేమానికి అనువైన పునరావాస పథక రచన సామాజిక అగత్యంగా భావించి మమ్మాదరించి మాకు సంక్షేమ బాటలు రూపొందించవలసినదిగా అభ్యర్థించడం పేరాశకాజాలదు.

RSBS

శతాబ్దాల తరబడి సాంప్రదాయాల పేరుతో మతం మాటున దుర్భర వ్యవస్థలకులోనై విధి వంచితులుగా నిల్చిన వర్గాలను సమసమాజ మార్గాన పయనింపచేయుటకై "జోగిని" "మాతంగి" "బసివి" మరియు "దేవదాసి" సంతతి వారసుల స్థితిగతులను అధ్యయనంచేసి సమస్యలను విచారించి పరిష్కార మార్గాలను అన్వేషించి ప్రభుత్వం చేపట్టవలసిన చర్యల నివేదికను సమర్పించవలసినదిగా భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వారి WP No (సివిల్) 627/2007 ఆదేశముల మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ GOMS No. 80 (PCR) Dept. తేది10-12-2010 ద్వారా నియమింపబడిన ఏకసభ్య (రఘునాధరావు) కమీషన్, రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాలతో పాటు క్షేత్రస్థాయిలో కృష్ణాజిల్లా-శ్రీకాకుళం గ్రామం, తూర్పుగోదావరి జిల్లా-తాటిపాక, మురమండ గ్రామాలలో పర్యటనలు జరిపి పలు సూచనలతో తన నివేదికను ది.26-06-2013న అందచేయుట జరిగింది. 19 మాసాలు గడిచినా ఏకసభ్య కమీషన్ నివేదికలోని ఏ చిన్న అంశాన్ని కూడా ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించిన యంత్రాంగం గత ప్రభుత్వంలో గాని నేటి ప్రభుత్వంలో గాని కానరాదు. 'జోగిని' 'మాతంగి' 'బసివి' వ్యవస్థలకు లోగడ పునరావాస పథకాలు ఏర్పరచడం అమలు చేయడం సమీక్షలు జరపడం జరిగాయి. కానీ 'దేవదాసి' వ్యవస్థకు చేపట్టిన పునరావాస పథక రచనలు ఏనాడూ కానరావు.

నిరోధ - నిషేద చట్టాలకు గురై పునరావాస పథకాలకుగాని ఆసరా ఆవాసనా ఆలోచనలకు గాని నోచుకొనక సంఘటిత పోరాటశక్తి లేక నిరాశ నిస్పృహల మధ్య జీవనయాత్రలు భారంగా కొనసాగిస్తున్న మావర్గానికి ఉపశమన మార్గాలతో ఊరట కల్పించుటకు ఆరు దశాబ్దాల అనంతరం సుప్రీంకోర్టువారి ఆదేశముల నేపథ్యంలో వెలువడిన ఏకసభ్య కమీషన్ తొలినివేదికలో పొందుపరచిన మరియు ప్రభుత్వ యంత్రాంగం, చేపట్టవలసిన చర్యలను ప్రాధాన్యతాక్రమంలో మీ ముందుంచు చున్నాము.

1. కుల-ఆదాయ-నివాస తదితర ధృవీకరణ పత్రాలు ఎటువంటి అవహేళనలకు ఆక్షేపణలకు తావులేకుండా జారీ చేయవలెను.
2. న్యూనత అవహేళనలను అధిగమించుటకు యస్.సి - యస్.టిల 1989 సం॥ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటిస్ చట్టం తరహాలో సూర్యబలిజ సామాజిక వర్గమునకు ప్రత్యేక చట్టం తేవాలి.
3. వికలాంగులకు - క్రీడాకారులకు గల ప్రత్యేక రిజర్వేషన్ తరహాలో ప్రభుత్వ ఉద్యోగాలలో 2% ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి.
4. సూర్యబలిజ సంక్షేమ మరియు అభ్యున్నతికి ప్రత్యేక ఆర్థిక నిధిని ఏర్పరచడం మరియు యస్.సి - యస్.టి సబ్‌ప్లానులో ప్రత్యేక బడ్జటు పొందుపరచడం.
5. సూర్యబలిజ సామాజిక వర్గమును కించపరచెడి అంశాలకు తావు లేకుండా సినిమా - టి.వి. ప్రసారాలను నియంత్రించుటకు ప్రత్యేక స్టీరింగ్ కమిటీని నియమించుట.
6. శతాబ్దాల తరబడి తమ స్వాధీన హక్కుభుక్తములలోగల కృష్ణాజిల్లా శ్రీకాకుళం శ్రీకాకుళేశ్వర స్వామివారి, పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయములలోని దేవదాసి ఈనాం భూములకు యితర సేవల ఈనాం భూములకు పట్టాలు మంజూరు చేసిన విధముగా పట్టాలు మంజూరు చేయుట.
7. పునరావాస పథకాలు నియంత్రంచుటకు సలహా మరియు పర్యవేక్షక మండళ్ళ నిమించుట.
8. వివాహ శుభకార్యాలకు రూ॥ 50,000/- ఆర్థిక సహాయం.
9. స్వయం ఉపాధి ఏర్పాట్లకు రూ॥ 1,00,000/- చొ॥న ఆర్థిక సహాయం.

యిత్యాది పలు పరిష్కార మార్గాల ద్వారా సమ సమాజ మార్గంలో విధివంచితులుగా నిల్చిన యీవర్గప్రజలను కూడా పయనింపజేయుటకు ఏకసభ్య కమీషన్ నివేదిక కేంద్ర బిందువుగా మీ ముందు కలదు.

ఏకసభ్య కమీషన్ నివేదికను గౌరవ సుప్రీంకోర్టు వారి ఆదేశములను అమలు చేయుటకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖామాత్యులుగా తమవంతు సహాయ సహకారములను అందచేయవలసినదిగా ప్రార్థిస్తూ......

మచిలీపట్నం
ది.26-1-2015

పమిడిముక్కల ఆనంద్
ప్రధాన కార్యదర్శి
Cell : 96039 03069

చిత్తజల్లు సాయిప్రసాద్
ఉపాధ్యక్షులు
Cell : 98491 18575

దాసరి కేశవులు
అధ్యక్షులు
Cell : 94402 75055

రాష్ట్ర సూర్యబలిజ సంఘం విజయవాడ. (రి.)

RSBS